

హెల్ప్‌లైన్ నంబర్లు	
దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్	18005728980
నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.174	270	300
సూర్యాపేట	రూ.170	230	260
నల్లగొండ	రూ.152	220	250

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.5 | కనిష్ఠం 24.0



నల్లగొండలోని దుప్పలపల్లిలోని గోదాంలో ఏర్పాట్లు చేసిన అధికారులు

మండు వేసవిని సైతం లెక్క చేయకుండా ఓటేసిన ప్రజల మనోగతం నేడు బహిర్గతం కానుంది. నరాలు తెగే ఉత్కంఠతో ఎదురు చూస్తున్న ప్రధాన పార్టీల భవితవ్యం నేటి మధ్యాహ్నానికి తేలిపోనుంది. గత నెల 14వ తేదీన జరిగిన నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ఓట్ల లెక్కింపును నేడు చేపట్టనున్నారు. ఇందుకోసం ఆయా జిల్లాల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నల్లగొండ ఓట్ల లెక్కింపును దుప్పలపల్లి సమీపంలోని గోదాంలో, భువనగిరి ఓట్ల లెక్కింపును భువనగిరి శివారులోని అరోరా కళాశాలలో చేపట్టనున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమయ్యే లెక్కింపునకు సిబ్బంది సర్వం సిద్ధం చేశారు.

నేడు ఉత్కంఠకు తెర



భువనగిరిలోని అరోరా కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

- భవితవ్యం తేలేది నేడే
- తొలి ఫలితం మిర్యాలగూడదే
- పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- నల్లగొండలో 14 టేబుళ్లు, 24 రౌండ్లలో ఫలితాలు
- ఉదయం 8 నుంచి మొదలవనున్న కౌంటింగ్

నల్లగొండ,జూన్ 3 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): లోక్‌సభ ఫలితాల ఉత్కంఠకు నేడు తెరపడనుంది. నల్లగొండ లోక్‌సభ స్థానాల నుంచి గెలిచేదెవరో నేడు తేలిపోనుంది. నల్లగొండ లోక్‌సభ స్థానానికి సంబంధించి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు నల్లగొండలోని ఎఫ్‌సీఐ గోదాముల వద్ద ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో కొనసాగుతుంది. కౌంటింగ్ ప్రక్రియ ఆసాంతం పకడ్బందీగా కొనసాగేందుకు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన నేతృత్వంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 8గంటలనుంచే మొదలయ్యే కౌంటింగ్‌లో రౌండ్లవారీగా ఫలితాలు వెలువడనున్నాయి. నల్లగొండ లోక్‌సభలో తక్కువ రౌండ్లున్న మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొదటి ఫలితం వెలువడనుండగా, చివరగా దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గ ఫలితం వెలువడుతుంది. నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి 22 మంది అభ్యర్థులు బరిలో నిలవగా ప్రధాన పోటీ రఘువీర్ కుందూరు (కాంగ్రెస్), కంచర్ల కృష్ణారెడ్డి (బీఆర్ఎస్), శానంపూడి సైదిరెడ్డి (బీజేపీ) మధ్య కొనసాగింది. నల్లగొండ లోక్‌సభ స్థానంలో మొత్తం 17,25,465 ఓట్లకు, మే 13న జరిగిన పోలింగ్‌లో 74.02శాతం అంటే 12,77,137 ఓట్లు పోలయ్యాయి.

నల్లగొండ పార్లమెంట్	
దేవరకొండ	24
నల్లగొండ	21
నాగార్జునసాగర్	22
హుజూర్‌నగర్	22
కోదాడ	22
సూర్యాపేట	22
మిర్యాలగూడ	19
మొత్తం రౌండ్లు	152

మొత్తం ఓట్లు	17,25,465
పోలైన ఓట్లు	12,77,137
పురుషులు	8,44,843
స్త్రీలు	6,43,450
పోలింగ్ శాతం	74.02

అభ్యర్థులు (బరిలో ఉన్న) 22

తొలుత పోస్టల్ బ్యాలెట్

కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక హాల్ వద్ద పోస్టల్ బ్యాలెట్లను తొలుత లెక్కిస్తారు. మొత్తం 24 టేబుళ్లపై ఈ బ్యాలెట్లను లెక్కించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కౌంటింగ్ ముగిశాక ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అయిదు పోలింగ్ బూత్‌లకు సంబంధించిన వీవీ ప్యాట్లను లెక్కించి, ఈవీఎం ఓట్లతో పోల్చి పరిశీలిస్తారు. అన్నిరౌండ్ల ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు పూర్తికానుంది.

నల్లగొండ లోక్‌సభ పరిధిలో..

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఓట్ల లెక్కింపు 24రౌండ్లుగా చేపడతారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళ్లను కౌంటింగ్‌కోసం ఏర్పాటు చేశారు. ఒక్కో రౌండ్‌లో ఒక్కో టేబుల్‌పై ఒక్కో ఈవీఎంలలో ఓట్లని లెక్కిస్తారు. ఈలెక్కన తక్కువగా 264 పోలింగ్ కేంద్రాలున్న మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓట్ల లెక్కింపు 19రౌండ్లలో పూర్తయితే, ఎక్కువగా 324 పోలింగ్ కేంద్రాలున్న దేవరకొండ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు 24రౌండ్ల వరకు కొనసాగుతుంది. 288 పోలింగ్ స్టేషన్లున్న నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ లెక్కింపు 21రౌండ్లలో కొనసాగనుంది. 306 పోలింగ్ కేంద్రాలున్న నాగార్జునసాగర్, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు 22 రౌండ్లలో, 296 పోలింగ్ స్టేషన్లున్న కోదాడలో 22 రౌండ్లు, 291 పోలింగ్ స్టేషన్లున్న సూర్యాపేటలో 22 రౌండ్లలో లెక్కింపు కొనసాగుతుంది.

144 సెక్షన్ అమలు

లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి తెలిపారు. ఎలాంటి ర్యాలీలు, సంబరాలకు అనుమతి లేదని, 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

యాదాద్రి, జూన్3(ఆంధ్రజ్యోతి): నేడు లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు జిల్లాయంత్రాంగం రంగం సిద్ధంచేసింది. భువనగిరి పార్లమెంట్ స్థానానికి 39మంది బరిలో ఉన్నారు. ఎంపీగా పార్లమెంట్‌లోకి అడుగు పెట్టేదెవరు అన్నది నేడు తేలనుంది. భువనగిరి పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని భువనగిరి మునిసిపాలిటీ పరిధిలోని అరోరా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం ఓట్ల క్కింపు సందర్భంగా పటిష్ఠమైన భద్రత ను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. భువనగిరి నియోజకవర్గ పరిధిలో భువనగిరి, ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్, జనగాం, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఈవీఎం కౌంటింగ్‌కు సంబంధించి ప్రతీ టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు. మైక్రో అబ్జర్వర్‌తో కలిసి అసిస్టెం ట్ రిటర్నింగ్ అధికారి రౌండ్ ప్రకారం ఫలితా లు నమోదు చేస్తారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ప్రత్యేక హాల్ ఏర్పాటు చేశారు. హోం ఓటింగ్, విధుల్లో ఉన్న సిబ్బందికి సంబంధించిన ఓటర్లను 14 టేబుళ్ల ద్వారా కౌంటింగ్ చేయనున్నారు. ఒక టే బుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, తహసీల్దార్ స్థాయి అధికారి ఏఆర్వోగా ఉంటారు. 14 టేబుళ్లకు సంబంధిం చి ఏఆర్వోలు ఉంటారు. సర్వీస్ ఓటర్లకు సంబంధించి ఈటీపీబీఎస్ పద్ధతితో స్కానింగ్ ద్వారా కౌంటింగ్ చేస్తారు.

కౌంటింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు నియోజకవర్గ అబ్జర్వర్లు రాబర్ట్ క్షేత్రమాయూమ్, ఎండీ ఎజ్బా హుస్సేన్ పర్యవేక్షిస్తారు. బందోబస్తు ఏర్పాట్లలో భాగంగా కౌంటింగ్ సిబ్బంది ప్రతి ఒక్కరికీ పాస్‌లు అందించారు. ప్రతీ టేబుల్‌కు ఒక కౌంటింగ్ ఏజెంట్ ఉండగా, వారికి కూడా పాస్‌లు అందజేశారు. పాస్‌లు ఉన్న వారికి మాత్రమే కౌంటింగ్ హాల్లోకి ప్రవేశం ఉంటుంది. ఫలితాలు మధ్యాహ్నం తర్వాతే వెలువడనున్నాయి. జిల్లాలోని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 18,08,585 ఓటర్లు ఉండగా, 13,88,680 ఓట్లు పోలయ్యాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా 76.78 శాతం పోలింగ్ నమోదైంది. కౌంటింగ్ కేంద్రం వద్ద మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. భువనగిరి లోక్‌సభ నుంచి 39మంది అభ్యర్థులు బరిలో నిలిస్తే, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్), బూరనర్సయ్యగౌడ్ (బీజేపీ), క్యామ మల్లేశ్ (బీఆర్ఎస్) నడుమ ప్రధాన పోటీ నెలకొంది.

భువనగిరిలో మూడంచెల భద్రత

కౌంటింగ్ కోసం భువనగిరిలో మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రతీ స్ట్రాంగ్ రూం వద్ద సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బందితోపాటు రాష్ట్ర సాయుధ సిబ్బంది, ఏఆర్ ఫోర్సు సివిల్‌ఫోర్సు ఉంటుంది. స్పెషల్ ఫోర్సు కూడా ఉంటుంది. మొబైల్ ఫోన్లు, పేపర్లు, తదితర వస్తువులు కౌంటింగ్ హాల్లోకి అనుమతించబోరు. లెక్కింపు ప్రక్రియను సీసీటీవీ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి, పోలీస్ కమిషనర్ పర్యవేక్షించనున్నారు. రెండు నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు కేంద్రానికి చేరుకుంటుండడంతో పోలీసులు 200మీటర్ల అవతలే ఉండాలని సూచించారు.

భువనగిరి పార్లమెంట్	
భువనగిరి	19
ఆలేరు	20
మునుగోడు	18
తుంగతుర్తి	19
నకిరేకల్	23
జనగాం	20
ఇబ్రహీంపట్నం	18
మొత్తం రౌండ్లు	137


మొత్తం ఓట్లు	18,08,585
పోలైన ఓట్లు	13,88,680
పురుషులు	8,98,416
స్త్రీలు	6,86,003
పోలింగ్ శాతం	76.47

అభ్యర్థులు (బరిలో ఉన్న) 39

కౌన్ బనేగా ఎంపీ?

- అభ్యర్థుల్లో టెన్షన్..టెన్షన్
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే

యాదాద్రి, జూన్3(ఆంధ్రజ్యోతి): ఎగ్జిట్ పోల్స్‌తో నేతల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ సారి ఎలాగైనా గట్టెక్కుదామని ఆశలు పెంచుకున్న నేతలకు అంచనాలు తారుమారు అవుతాయా? అనే అలజడి మొదలైంది. కౌన్ బనేగా భువనగిరి ఎంపీ అన్నది మంగళవారం మధ్యాహ్నం వరకు తేలనుంది. సార్వత్రిక ఎన్నికలను అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. అధికారాన్ని నిలబెట్టుకుని హ్యాట్రిక్ సాధించాలని ఎన్‌డీఏ... ఈ సారి ఎలాగైనా అధికారంలోకి రావాలని ఇండియా కూటమి, ఇతర పార్టీలు, స్వతంత్రులు హోరాహోరీగా పోటీపడ్డాయి. అభ్యర్థులతోపాటు ఆయా పార్టీల శ్రేణులు ఎన్నికల్లో విజయం సాధించేందుకు 45రోజులపాటు తీవ్రంగా శ్రమించాయి. ఈ ఎన్నికల్లో జిల్లా ఓటర్లు ఎవరికి పట్టం కడతారు? ఏ పార్టీ వైపు మొగ్గుచూపుతారు? ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు వస్తాయా? అన్న అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నేటితో అభ్యర్థుల్లో ఉత్కంఠకు తెరపడనుంది. సార్వత్రిక ఎన్నికలకు కీలక ఘట్టమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియను సర్వం సిద్ధమైంది. ఎన్నికల ఫలితాలకోసం పోటీలో ఉన్న అభ్యర్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఇబ్రహీంపట్నం, జనగాం, భువనగిరి, ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ సారి జరిగిన ఎన్నికలు మునుపెన్నడూ లేని విధంగా జిల్లాలో పోటాపోటీగా పోరు సాగింది. రికార్డుస్థాయిలో పోలింగ్ నమోదైంది. రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల్లో అత్యధికంగా 76.78శాతం ఓటింగ్ నమోదైంది. అభ్యర్థుల భవితవ్యం తేల్చే ఓట్ల లెక్కింపు ఘడియలు రానే వచ్చాయి. దీంతో అభ్యర్థుల్లో మరింత హైటెన్షన్ ప్రారంభమైంది. ఎన్నికల ఫలితాలు పోటాపోటీగానే ఉంటాయని సర్వేలు వెల్లడించడంతో స్వతంత్రులు, తిరుగుబాట్ల ఓట్లు చీలికపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. బీఆర్ఎస్, బీజేపీ ఒకవైపు, అధికార కాంగ్రెస్ మరోవైపు నియోజకవర్గాల్లోని పల్లెలు, పట్టణాల్లో ప్రచార హోరెత్తించాయి. దీంతో ఈ ఎన్నికల్లో ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో అన్న ఆసక్తి రేపుతోంది. ఓటరు నాడి అంతు చిక్కకపోవడంతో జిల్లాలోని అన్ని ప్రధాన పార్టీ శ్రేణులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాయి. ఏ పార్టీకి మెజార్టీ లభిస్తుందోనని నేతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. మంగళవారం వెలువడనున్న ఫలితాల్లో ఏ పార్టీకి అధికార పీఠం దక్కుతుందోనని ఆసక్తిగా మారింది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఓటర్ల నాడి గుంభనంగా ఉండటంతో ఫలానా పార్టీ అభ్యర్థి గెలుస్తారనే స్పష్టంగా చెప్పలేని పరిస్థితి. అభ్యర్థుల గెలుపోటములను తేల్చిచెప్పే సమయం ఆసన్నమైంది. మంగళవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తిచేసి అదే రోజు ఫలితాలు ప్రకటించడంతో అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. గెలుస్తామా? ఓడిపోతామా.. అనేది స్పష్టత లేకపోవడంతో అందరిలోనూ ఫలితాల జ్వరం పట్టుకుంది. ఎవరికి వాళ్లు కూడికలు... తీసివేతల లెక్కల్లో మునిగితేలుతున్నా.. ఓటరు నాడి అంతు చిక్కకపోవడంతో గెలుస్తామో అన్న ఆందోళన ప్రారంభమైంది.



ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించాలి



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

నల్లగొండ టౌన్: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపును సజావుగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం జిల్లా పరిశీలకులు మనోజ్ కుమార్ మాణిక్‌రావు సూర్యవంశి అన్నారు. సోమవారం ఆయన కౌంటింగ్ ఎన్నికల పరిశీలకులు ఉపేంద్ర కుమార్‌తో కలిసి దుప్పలపల్లి గోదాంలో పార్లమెంట్ ఎన్నికల ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను, అలాగే కౌంటింగ్ కేంద్రాలను తనిఖీచేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందే అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఇతర జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.

ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బంది కేటాయింపు



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న రాబర్ట్ సింగ్, ఎజ్జబా హుస్సేన్

కలెక్టర్ భువనగిరి అర్బన్: భువనగిరి పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బంది కేటాయింపు జరిగినట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ నేడు నిర్వహించే ఓట్ల లెక్కింపు సిబ్బంది ఎన్నికల లెక్కింపు పరిశీలకులు రాబర్ట్‌సింగ్ క్షేత్రిమాయూమ్, ఎం.డీ ఎజ్జబా హుస్సేన్ సమక్షంలో కేటాయించినట్లు చెప్పారు. ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు సిబ్బందిని కేటాయించామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్, డీఈవో కే.నారాయణరెడ్డి, కలెక్టరేట్ ఏవో సి.జగన్మోహన్ ప్రసాద్ పాల్గొన్నారు.

వడపర్తి కాల్వ పనులను పూర్తి చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్



కాల్వ పనులను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న జహంగీర్

భువనగిరి రూరల్, జూన్ 3: వడపర్తి నుంచి భువనగిరి పెద్ద చెరువులోకి నీరు వెళ్లే రాచకాల్వ పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ డిమాండ్‌చేశారు. సోమవారం మండలంలోని అమలాపురం శివారులో రాచకాల్వ పనులను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం సమీపించినా పనులను పూర్తి చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. అదేవిధంగా మధ్యమధ్యలో నిలిచిపోయిన కల్వర్టు పనులను పూర్తిచేసి రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. లేదంటే కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, నాయకులు దయ్యాల నర్సింహ, మోటే ఎల్లయ్య, బండి శ్రీను, సత్తిరెడ్డి, అంజిరెడ్డి, ప్రభాకర్, అంజయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

గుజరాత్ మోడల్ ఎగ్జిట్ పోల్స్‌ను నమ్మొద్దు

కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



భువనగిరిలో విలేకరులతో మాట్లాడుతున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

యాదాద్రి, జూన్3(ఆంధ్రజ్యోతి): ఎగ్జిట్ పోల్ అనేది గుజరాత్ మోడల్ ఎగ్జిట్ పోల్‌లాగా అనిపిస్తోందని, వీటిని నమ్మొద్దని కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం భువనగిరిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని షేర్ మార్కెట్‌కి సంబంధించిన బ్రోకర్లంతా గుజరాత్ లోనే ఉంటారని, ఎగ్జిట్ పోల్స్ కూడా షేర్ మార్కెట్‌ను తలపిస్తున్నాయన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వెలువడిన ఎగ్జిట్ పోల్స్ దేశప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయని, గుజరాత్ మోడల్ ఎగ్జిట్ పోల్ మాదిరిగా ఉన్నాయని వెల్లడించారు. రాష్ట్రంలో కేవలం కాంగ్రెస్‌కు 4సీట్లు వస్తాయని వెల్లడించడం విడ్డూరంగా ఉందన్నారు. మంగళవారం మధ్యాహ్నంలోగా వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. బీఆర్ఎస్ ఓటు బీజేపీకి క్రాస్ కావడంతోనే బీజేపీ రాష్ట్రంలో పోటీలో ఉందని, బీఆర్ఎస్, బీజేపీ పరస్పర అవగాహనతో ముందుకు వెళ్తున్నాయని ఆరోపించారు. బీజేపీకి ఈ నియోజకవర్గంలో ఓటు బ్యాంకులేదని, ఈ ఎన్నికల్లో కూడా పెద్దగా ఓట్లు లభించలేదన్నారు. ఎక్కడో ఉండాల్సిన బీజేపీ బీఆర్ఎస్ కారణంగా పోటీ ఇచ్చే స్థాయికి చేరుకుందన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బీజేపీకి సహకరిస్తే, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బీఆర్ఎస్‌కు సహకరించిందన్నారు. రాబోయే ఫలితాల్లో లక్షకుపైగా మెజార్టీతో భువనగిరిలో కాంగ్రెస్ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో 10నుంచి 12ఎంపీ సీట్లు కైవసం చేసుకుంటామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రజాస్వామ్యాన్ని దిగజార్చిందని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌తో ప్రజల ఆత్మగౌరవాన్ని, హక్కులను కాలరాసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు.

నిరంతరం ప్రజలను మోసం చేయడం బీజేపీ, బీఆర్ఎస్‌లకు అలవాటన్నారు.లక్షన్నర కోట్లతో నిర్మించిన కాళేశ్వరం కూలిపోయే స్థితిలో ఉందని, కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలకు మాజీ ముఖ్యమంత్రి హోదాలో ప్రభుత్వం ఆహ్వానిస్తే గైర్హాజరు కావడంతోపాటు విమర్శలు చేయడం కేసీఆర్ అప్రజాస్వామ్యానికి నిదర్శనమన్నారు. సమావేశంలో భువనగిరి మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాల కొరత సృష్టిస్తే కేసులు

డీఏవో అనురాధ



భువనగిరిలోని ఫర్టిలైజర్ దుకాణంలో విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న అనురాధ

భువనగిరి రూరల్, జూన్ 3: ఎరువులు, విత్తనాల కొరత చూపితే సంబంధిత డీలర్లపై కేసులు నమోదు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి కే.అనురాధ హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపును ఆమె ఆకస్మికంగా తనిఖీచేసి విత్తనాల ప్యాకెట్లు, ఎరువుల బ్యాగులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలన్నారు. లైసెన్సులు కలిగి ఉన్న డీలర్ల వద్దే రైతులు నాణ్యమైన విత్తనాలను కొనుగోలుచేసి రశీదు పొందాలన్నారు. ప్రతీ రోజు ఎరువులు,విత్తనాలకు సంబంధించిన నిల్వల ధరలపట్టిక బోర్డును దుకాణం ఎదుట ఏర్పాటుచేయాలన్నారు. తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి పావని పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే నెరవేరిన స్వరాష్ట్ర ఆకాంక్షలు



8 భువనగిరిలో తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

- ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి

రామన్నపేట, జూన్ 3: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సరైన పౌష్టికాహారం అందజేయాలని ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి అన్నారు. సోమవారం రామన్నపేటలో సీడీపీవో కార్యాలయంలో జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వేసవి సెలవులు ముగించుకొని విధుల్లో చేరిన అంగన్‌వాడీ టీచర్లు, పిల్లలకు సరైన పోషకాహారం అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరాచేసిన గ్రోత్ మిషన్స్‌తో సరైన బరువులు, కొలతలు చూసి పిల్లల పరిస్థితిని తల్లిదండ్రులకు వివరించాలన్నారు. సీడీపీవో చాగంటి శైలజ అధ్యక్షత వహించగా సూపర్‌వైజర్, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీల సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణవేణి

పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నల్లగొండ, జూన్ 3: పదవ తరగతి అడ్వాన్స్‌డ్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 3 పరీక్షా కేంద్రాల్లో 590 మంది విద్యార్థులకు గాను 532 విద్యార్థులు హాజరుకాగా 58 మంది గైర్హాజరయ్యారు. కాగా జిల్లాలో ఎక్కడా మాస్ కాపీయింగ్ కేసులు నమోదు కాలేదు.

నేడు, రేపు మద్యం దుకాణాలు బంద్

నల్లగొండ, జూన్ 3: పార్లమెంట్ ఓట్ల కౌంటింగ్ నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో జిల్లా వ్యాప్తంగా మందు దుకాణాలు బంద్ ఉండనున్నట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.



లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్

- నల్లగొండ జిల్లా చిట్యాలలో రోడ్డు ప్రమాదం
- ఒకరు మృతి, మరొకరికి గాయాలు
- మృతుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాసి






కుటుంబరావు మృతదేహానికి పంచనామా నిర్వహిస్తున్న ఎస్ఐ లింగయ్య

చిట్యాలరూరల్, జూన్ 3: జాతీయ రహదారిపై వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు లారీని ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుం డ్రాంపల్లి శివారులో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. చిట్యాల ఎస్ఐ - 2 లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా కైకలూరు మండలం భంజబలపట్నం గ్రామానికి చెందిన ఆగు సోమల కుటుంబరావు (42) హైదరాబాద్‌లోని కోమటి ప్రైవేట్ ట్రావెల్స్‌లో బస్సు క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా ఈ నెల 2వ తేదీన రాత్రి హైదరాబాద్‌లోని బీహెచ్ఈఎల్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడకు ప్రయాణికులతో వెళ్తున్న కోమలి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో డ్రైవర్ అరిగిల మణికంఠతో పాటుగా బయలుదేరాడు. మార్గమధ్యలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అర్ధరాత్రి దాటాక చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి శివారులోకి చేరుకోగానే పెట్రోల్ బంకు నుంచి లారీ అకస్మాత్తుగా వేగంగా రోడ్డు మీదకు వచ్చింది. దీంతో బస్సు అదుపుకాక లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న కుటుంబరావుతో పాటుగా డ్రైవర్ మణికంఠకు గాయాలయ్యాయి. బస్సులోనే ఉన్న మరో డ్రైవర్ నాగేంద్రవరప్రసాద్ ఇద్దరిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కుటుంబరావు మృతి చెందాడు. మృతుడు కుటుంబరావు భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగయ్య పేర్కొన్నారు.

'200 రోజులు ఉపాధి పని కల్పించాలి'

మాడ్గులపల్లి, జూన్ 3: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతీ కూలీకి 200 రోజుల పనిదినాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మన్నెం భిక్షం, గండమల్ల రాములు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఉపాధి కూలీకి రూ.130, రూ.150 చెల్లిస్తే కుటుంబాలకు ఎలా పోషించుకుంటారని వారు ప్రశ్నించారు. ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు గుంటోజు వెంకటాచారి, బొంగర్ల వెంకటయ్య, బొల్లెద్దు నాగయ్య, నగిరె కిష్టయ్య, వంశీ, కృష్ణ, శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.















50.2 మిల్లీ మీటర్ల వర్షపాతం

● చల్లబడిన వాతావరణం ● పల్లెల్లో వ్యవసాయ పనుల సందడి



నల్లగొండ, జూన్ 3: నైరుతి ప్రభావంతో వర్షాలు పడడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పల్లెల్లో వ్యవసాయ పనుల సందడి మొదలైంది. చాలాచోట్ల విత్తనాలు వేయడం మొదలు పెట్టారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 8.30గంటల వరకు నల్లగొండ జిల్లాలో సగటున 50.2మి.మీల వర్షపాతం నమోదైంది. డివిజన్ల వారీగా పరిశీ లిస్తే దేవరకొండ డివిజన్‌లో అత్యధికంగా 621.4 మి.మీల వర్షపాతం నమోదు అయింది. డివిజన్‌లో అత్యధికంగా గుర్రంపోడు 115.2 మి.మీలు, కొండమల్లేపల్లి 102.8మి.మీలు, దేవరకొండలో 103.8మి.మీలు చందంపేటలో 94.1మి.మీలు, చింతపల్లిలో 93.3మి.మీలు, పీఏపల్లిలో 82.9 మి.మీల వర్షపాతం నమోదైంది. నాంపల్లిలో 58.8మి.మీలు, చండూరులో 57.1మి.మీలు, మునుగోడులో 43.8 మి.మీల వర్షం పడింది. అనుములలో 47.9 మి.మీలు, వేములపల్లిలో 64.1 మి.మీలు, మిర్యాలగూడలో 58.6మి.మీలు, దామచర్లలో 62.1మి.మీలు, పెద్దవూరలో 57.1మి.మీల వర్షం పడింది. శాలిగౌ రారంలో 68.3మి.మీలు, కట్టంగూరులో 40.8మి.మీలు, నకిరేకల్ 47.8మి.మీలు, తిప్పర్తిలో 50.2మిమీలు, కనగల్‌లో 39.4మి.మీల వర్షం కురిసింది. వర్షం పడడంతో జిల్లాలో వాతావరణంలో మార్పు వచ్చింది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా సోమ వారం నాడు గరిష్ట ఉష్ణోగ్రత 34.5డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 24.0డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. తీవ్ర ఎండలతో సతమతమైన ప్రజలు వాతావ రణంలో మార్పులు రావడంతో జిల్లా ప్రజలు ఊరట చెందారు.



నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కొరటికల్ గ్రామంలో పొలం దున్నుతున్న రైతు

నల్లగొండ జిల్లా నల్లగొండ మండలంలోని దీపకుంట గ్రామంలో దుక్కి దున్ని పొలం సిద్ధం చేస్తున్న రైతు

తొలకరి పలకరించి..

తొలకరి పలకరించడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. భూములను అరకలు, ట్రాక్టర్లతో చదును చేసుకొని దుక్కులు దున్నుతున్నారు. గతానికి భిన్నంగా నైరుతి రుతుపవనాలు పలకరించడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వ్యవసాయ పనులు మొదలయ్యాయి. మే నెలలో కురిసిన అకాల వర్షాలకు దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు నైరుతి ప్రభావంతో వర్షాలు పడడంతో సోమవారం నుంచే పల్లెల్లో సందడి మొదలైంది. విత్తనాలు చల్లడం ప్రారంభించారు.



స్టార్టర్ సరి చూసుకుంటూ..



విత్తనాలు నాటుతూ..



భూమిని దున్నకానికి సిద్ధం చేస్తున్న వ్యవసాయ కూలీలు



ట్రాక్టర్లతో భూమి దున్నుతున్న రైతులు



విత్తనాలు నాటుతున్న కూలీలు



పొలంలో ఎరువు సిద్ధం చేసుకొని.. భూమి దున్నుతూ..

హరిహరులకు విశేష పూజలు



ప్రధానాలయంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

● ప్రతిరోజూ 1000మందికి అన్నప్రసాద వితరణ

భువనగిరి అర్బన్, జూన్ 3: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి కొండపై సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామి, అమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ రీతిలో, అనుబంధ ఆలయంగా కొనసాగుతున్న పర్వతవర్ధిని రామ లింగేశ్వరస్వామికి శివాలయంలో స్పటిక మూర్తులకు శైవాగమ శాస్త్ర రీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాల యంలో సుప్రభాత సేవతో స్వామి, అమ్మవారిని మేల్కొలిపిన అర్చకస్వాములు మూల మూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభి షేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసా గాయి. శివాలయంలోని ముఖమండపంలో స్పటికమూర్తులను అర్చ కులు వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృ తాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగిం చారు. ఆలయ ఖజానాకు సోమవారం వివిధ విభాగాల ద్వారా రూ. 28,80,593ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. ప్రతి స్వాతి నక్షత్రం రోజున గిరిప్రదక్షిణ సమయంలో నడక దారిలో భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఈవో అడిగి తెలుసుకున్నారు. కొండ కింద సత్రంలో 600మందికి అన్నప్రసాదం అందజేస్తుండగా సోమవారం నుంచి 1000మందికి అన్నప్రసాదం అందజేసే కార్య క్రమాన్ని ఈవో భాస్కర్‌రావు ప్రారంభించి, భక్తులకు అన్నం వడ్డించారు. తూర్పు రాజగోపురం వద్ద కొనసాగుతున్న వీఐపీ (రూ. 150) ప్రత్యేక దర్శనం క్యూలైన్ పనులను ఆయన పరిశీలించారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆలయ ఈవో భాస్కర్‌రావు

యాదగిరిపల్లిలో సౌమ్య అంత్యక్రియలు

యాదగిరిగుట్ట రూరల్, జూన్ 3: అమెరికాలో గత నెల 26వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గుడ్ల సౌమ్య అంత్యక్రియలు సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిపల్లిలో ముగిశాయి. అమెరికాలోని తానా మహాసభ సభ్యులు, సౌమ్య బంధువుల సహకారంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సౌమ్య మృతదేహానికి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు నివాళులర్పించారు.



సౌమ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న విప్ అయిలయ్య

మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడి

నేరేడుచర్ల, జూన్ 3: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలిపై(50) లైంగిక దాడి చేసిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నేరేడుచర్ల ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలిపై అదే వీధికి చెందిన వానరాసి రాములు ఏడాది క్రితం లైంగిక దాడికి పాల్పడ్డాడు. కూలి పని చేసి జీవించే యడవెల్లి యాదగిరి నాలుగు రోజుల క్రితం ఆమెకు కూల్ డ్రింక్ తాపిస్తానని తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. సోమవారం బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ఇద్దరిపై కేసు నమోదుచేశామని ఎస్ఐ తెలిపారు. బాధిత దివ్యాంగురాలిని వైద్య పరీక్షల నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి పంపినట్లు ఎస్ఐ తెలిపారు. భర్త దూరంగా ఉండటంతో బాధితురాలు తండ్రి వద్దే ఉంటోంది.

ఒక్కరోజులోనే కేసు ఛేదించిన పోలీసులు

తుంగతుర్తి, జూన్ 3: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలకేంద్రంలోని ఓ ఇంట్లో ఆదివారం ఉదయం దొంగతనం జరిగింది. ఈ కేసును పోలీసులు ఛాలెంజ్‌గా తీసుకుని ఒక్కరోజులోనే దొంగను అరెస్ట్ చేసి డబ్బులు రికవరీ చేశారు. సీఐ శ్రీనునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. తన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు డబ్బులు దొంగలించారని తుంగతుర్తి మండల కేంద్రంలోని నార్లపురం శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాల మేరకు క్లూస్‌టీమ్‌ను రంగంలోకి దింపి చుట్టు పక్కల ఇళ్లలోని సీసీ కెమెరాల రికార్డులను పరిశీలించి దొంగతనం చేసిన అనుమానితుడిని మండలకేంద్రానికి చెందిన కల్లూరి సురేష్‌గా గుర్తించి ఇంటి వద్ద సోమవారం ఉదయం పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిని విచారించగా ఇంట్లో దొంగలించిన రూ.4లక్షల నగదు, మొబైల్ ఫోన్, మోటారు సైకిల్, ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఎస్ఐలు ఏడుకొండలు, మధునాయుడు, ఏఎస్ఐ భగవాన్, హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, కానిస్టేబుళ్లు సతీష్, విజయ్‌కుమార్ హోంగార్డు రవి, వెంకన్నను డీఎస్పీ అభినందించారు.

కుటుంబకలహాలతో..

కోదాడ, జూన్ 3: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. టౌన్ ఎస్ఐ బి. శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నయానగర్‌కు చెందిన గాజుల రవి(36) ఆర్టీసీ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో భార్య భువనేశ్వరి ఇద్దరు పిల్లలతో కలిసి తల్లిగారి స్వగ్రామం బరాఖత్‌గూడెం వెళ్లింది. ఇంట్లో మద్యం తాగి లోపల గడియ పెట్టుకొని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం భార్య భర్తకు ఫోన్ చేస్తే ఎంతకు ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి కోదాడకు వచ్చింది. బయట నుంచి తలుపులను కొట్టినప్పటికీ తీయకపోవడంతో ఇంటి పక్కవారిని పిలిపించి తలుపులు తెరిచి చూశారు. అప్పటికే రవి మృతిచెంది ఉన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



నల్లగొండ జిల్లాకేంద్రం శివారు దుప్పలపల్లి సమీపంలో లెక్కింపునకు సిద్ధం చేసిన కౌంటింగ్ హాల్

లెక్కింపునకు సర్వం సిద్ధం

నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాల నుంచి గెలిచేదెవరో నేడు తేలిపోనుంది. నల్లగొండ లోక్‌సభ స్థానానికి సంబంధించి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు నల్లగొండలోని ఎఫ్‌సీఐ గోదాముల వద్ద ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో కొనసాగుతుంది. భువనగిరి లోక్‌సభకు సంబంధించి భువనగిరిలోని అరోరా కాలేజీ ప్రాంగణంలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ ప్రక్రియ ఆసాంతం పకడ్బందీగా కొనసాగేందుకు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల కలెక్టర్లు దాసరి హరి చందన, హనుమంతు కే.జెండగే నేతృత్వంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 8గంటలనుంచే మొదలయ్యే కౌంటింగ్‌లో రౌండ్లవారీగా ఫలితాలు వెలువడనున్నాయి. నల్లగొండ లోక్‌సభలో తక్కువ రౌండ్లున్న మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొదటి ఫలితం వెలువడనుండగా, చివరగా దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గ ఫలితం వెలువడుతుంది.



నల్లగొండలోని సమాచార కేంద్రం



భువనగిరిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర



నల్లగొండలో ఏర్పాటు చేసిన టేబుళ్లు



నల్లగొండలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు



భువనగిరిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ జెండగే



భువనగిరిలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్



భువనగిరిలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లు

ఉద్యమాలతోనే సమసమాజ నిర్మాణం



జెండాను ఆవిష్కరిస్తున్న ఎన్ఎఫ్‌డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు సబిత

భువనగిరి టౌన్, జూన్ 3: నిరంతర ఉద్యమాలతోనే అంతరాలు లేని సమాజ నిర్మాణం సాధ్యమని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్‌డబ్ల్యూ) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన సబిత, బండి జంగమ్మ అన్నారు. సోమవారం భువనగిరిలో నిర్వహించిన సమాఖ్య 70వ ఆవిర్భావ దినోత్సవంలో వారు అరుణ పతాకాన్ని ఎగురవేసి మాట్లాడారు. మహిళల సమస్యల పరిష్కారానికి సమాఖ్య పోరాటాలు చేస్తుందన్నారు. మహిళలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. సమాఖ్య ప్రతినిధులు వడ్లకొండ భారతమ్మ, ఆరె పుష్ప, మద్దూరి భాగ్యమ్మ, నరసమ్మ, సరళ, జ్యోతి, సౌమ్య, రాములమ్మ, స్వరూప, లక్ష్మీ, సునీత, పుష్ప పాల్గొన్నారు.

కేంద్రంలో మోదీ ప్రభుత్వం హ్యాట్రిక్ పక్కా



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య

మోత్కూరు, జూన్ 3: పార్లమెంటు ఓట్ల లెక్కింపులో ప్రధాని మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం విజయం సాధించి హ్యాట్రిక్ కొడుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య, జిల్లా కోశాధికారి గుజ్జ సోమనర్సయ్య అన్నారు. సోమవారం మండలంలోని దత్తప్పగూడెంలో ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై బీఆర్ఎస్‌కు చెందిన గ్రామ పంచాయతీ 2వ వార్డు మాజీ సభ్యురాలు కంచర్ల మంజుల, యూత్ నాయకులు కంచర్ల నర్సింహారెడ్డి, ఏనుగుల మచ్చగిరి బీజేపీలో చేరారు. వారికి రామచంద్రయ్య, సోమనర్సయ్య పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా ఇన్‌చార్జి కడియం కళ్యాణ్‌చందర్, పార్టీ మోత్కూరు మునిసిపల్ శాఖ అధ్యక్షుడు పోచం సోమయ్య, నాయకులు ఏనుగు జితేందర్‌రెడ్డి, గుంటి సతీష్, గుదే మధుసూదన్, సుతారపు వెంకన్న, నాయిని ఉపేందర్ పాల్గొన్నారు.

నూతన భవనంలో జిల్లా సహకార బ్యాంక్ మార్పు



నూతన భవనంలో ప్రారంభమైన జిల్లా సహకార బ్యాంక్

రామన్నపేట, జూన్ 3: రామన్నపేట పాత బస్టాండ్ సమీపంలో ఉన్న జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ శాఖను సరిపడు వసతులు లేని కారణంతో సోమవారం నూతన భవనంలోకి మార్చినట్లు బ్యాంకు అధికారి సాంబయ్య తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ ఉప్పల రవీందర్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి బ్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన భవనంలోకి బ్యాంకును మార్చడంతో ఖాతాదారులకు మెరుగైన సదుపాయాలు అందుతాయని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాగులకుంటకు జలకళ



నీటితో కళకళ లాడుతున్న నాగులకుంట

చౌటుప్పల్ టౌన్, జూన్ 3: చౌటుప్పల్ పట్టణంలోని నడిబొడ్డులో ఉన్న నాగుల కుంట జలకళను సంతరించుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ కుంటలోకి వరద నీరు చేరుకోవడంతో నీటితో కళకళలాడుతోంది. ఈ కుంటలోకి నీరు చేరడంతో కాలనీల్లోని బోరు బావుల్లో భూగర్భజలాలు పైకి వచ్చే అవకాశాలు ఏర్పడ్డాయి.

పట్టణాభివృద్ధే లక్ష్యం: చైర్మన్ వెంకటేశ్వర్లు



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న చైర్మెన్ వెంకటేశ్వర్లు

భువనగిరి టౌన్, జూన్ 3: పట్టణాభివృద్ధే మునిసిపల్ యంత్రాంగ లక్ష్యమని భువనగిరి మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జరిగిన వేర్వేరు కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. పట్టణంలోని 35వార్డుల్లో నెల కొన్న సమస్యలను పరిష్కరిస్తామని, ఇందుకోసం ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే బస్తీ యాత్రలు చేపడతామన్నారు. భువనగిరి పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలలో కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు కూర వెంకటేష్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బర్రె నరేశ్, కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్ నాగారం శంకర్, తాడూరి నర్సింహ, ఖైశెట్టి రవీందర్, ఎలిగి సురేందర్, ఎండి.జలీల్, ఎస్‌డి.ముల్తాన్‌షా పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైక్లింగ్ పోటీలు



సైక్లింగ్ పోటీలో పాల్గొన్న చిన్నారులు

భువనగిరి టౌన్, జూన్ 3: ప్రపంచ సైక్లింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం భువనగిరిలో చిన్న పిల్లలకు సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. ప్రముఖ సామాజిక కార్యకర్త వెల్లంకి పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక శ్రీధ్ర కాలనీలో నిర్వహించిన పోటీల్లో పలువురు చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

కేసీఆర్‌తోనే సాకారమైన స్వరాష్ట్ర ఆకాంక్ష





భువనగిరిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, జిల్లా ఆసుపత్రిలో పండ్లను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి



ఆలేరు సీహెచ్‌సీలో పండ్లను అందజేస్తున్న మాజీ ప్రభుత్వ విప్ సునీత

భువనగిరి టౌన్/ ఆలేరు రూరల్, జూన్ 3: మాజీ సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు, అభివృద్ధి సాధ్యమైందని పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద బిక్షమయ్యగౌడ్, గొంగిడి సునీత అన్నారు. సోమవారం భువనగిరిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో వారు మాట్లాడారు. కేసీఆర్ తన తొమ్మిదున్నరేళ్ల పాలనలో బంగారు మయం చేసిన రాష్ట్రాన్ని మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు నెలల్లోనే ఆగమాగం చేస్తోందని విమర్శించారు. ఉద్యమ సారథిగా, పాలకుడిగా కేసీఆర్ గొప్పతనం, సామర్థ్యం ప్రజలకు తెలుసని కానీ తెలంగాణ ఉద్యమమంటే తెలియని రేవంత్‌రెడ్డి ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాడని విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయలేని అసమర్థ ప్రభుత్వానికి త్వరలో కాలం చెల్లుతుందన్నారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సర్వసాధారణమని, ప్రజల పక్షాన ప్రభుత్వంపై బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. ముందుగా జాతీయ పతాకం, బీఆర్ఎస్ జెండాలను ఎగురవేసి తెలంగాణా తల్లి, అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. జిల్లా ఆసుపత్రిలో బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం, మాజీ చైర్మన్లు ఎనబోయిన ఆంజనేయులు, డాక్టర్ జడల అమరేందర్‌గౌడ్, కొల్పుల అమరేందర్, కేశవ పట్నం రమేష్, చింతల కిష్టయ్య, అతికం లక్ష్మీనారాయణగౌడ్, ఎడ్ల సత్తిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్ష కార్యదర్శులు ఏవీ.కిరణకుమార్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నీల ఓంప్రకాష్, ఇట్టబోయిన గోపాల్ పాల్గొన్నారు.

● తెలంగాణ ఉద్యమానికి ఆరాధ్యుడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అని ప్రభుత్వ విప్ మాజీ గొంగిడి సునీత అన్నారు. తెలంగాణ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలేరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పూర్తిగా విఫలమైందని అన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రాంచంద్రారెడ్డి, మునిసిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, బింగి రవి, మల్లేశ్, రాంగోపాల్‌రెడ్డి ఉన్నారు.

మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలి



మోటకొండూర్‌లో అంగన్వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తున్న కో ఆర్డినేటర్ హర్ష



మహిళలకు బ్యూటీషియన్ కిట్లను అందజేస్తున్న మునిసిపల్ చైర్మన్ రాజు

మోటకొండూర్, జూన్ 3: మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలని జిల్లా మహిళా సాధికారత బృందం మిషన్ కో ఆర్డినేటర్ హర్ష, మండల సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతి కార్యాలయంలో అంగన్వాడీ టీచర్లకు అవగాహన కల్పించి మాట్లాడారు. లింగ సమానత్వం, గృహహింస చట్టం, బాల్య వివాహాలు, పీసీపీఎన్‌డీటీ చట్టం 2012, స్వీయ స్వాతంత్ర్యం, ఆర్థిక అభివృద్ధి, ఆర్థిక స్వాతంత్ర్యం, సుకన్య సమృద్ధి యోజనఖాతా గురించి వివరించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుడాలని అన్నారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ నికిత, మనీషా, రాధిక, శోభ, భాగ్యలక్ష్మి, లావణ్య, సిద్దమ్మ, వసంత ఉన్నారు.

చౌటుప్పల్ టౌన్ : మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు కోరారు. స్థానిక షాదీఖానలో అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 45 రోజుల పాటు నిర్వహించే ఉచిత బ్యూటీషియన్ శిక్షణా కేంద్రాన్ని సోమవారం చైర్మన్ రాజు ప్రారంభించారు. శిక్షణను పొందే మహిళలకు బ్యూటీషియన్ కిట్లను చైర్మన్ అందజేశారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ మూర్తి, కో- ఆర్డినేటర్ మంగ, టీచర్ మహేశ్వరి పాల్గొన్నారు.

ఓయూ, అంబేడ్కర్ ఫొటోలను పొందుపరచాలి



కలెక్టరేట్‌లో ఏవోకు జగన్మోహన్‌కు వినతి పత్రం అందజేస్తున్న నల్ల నరేందర్

భువనగిరి అర్బన్, జూన్ 3: రాష్ట్ర ప్రభుత్వ నూతన చిహ్నాంపై ఉస్మానియా యూనివర్సిటీ, భారత రత్న బీ.ఆర్ అంబేద్కర్ చిహ్నాలను కూడా పొందుపరచాలని ధర్మ సమాజ్ పార్టీ ప్రతిపాదించిందని పార్టీ జిల్లా కన్వీనర్ నల్ల నరేందర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఏవో సి.జగన్మోహన్‌కు పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రతిపాదనను తమ పార్టీ స్వాగతిస్తోందని తెలిపారు. తెలంగాణ ప్రజానీకం గర్వించదగిన ప్రతిపాదనను ఆమోదించాలని ఆయన కోరారు. అగ్రవర్ణ భూస్వామ్య పాలకవర్గంపై అణగారిన వర్గాల రాజ్యం, హక్కుల కోసం యుద్ధం చేసిన పండుగ సాయన్న, సర్దార్ పాపన్న, సమ్మక్క సారలక్కల చిత్రాలను కూడా ప్రతిపాదిత చిహ్నాంలో ఉంచామన్నారు. సమానత్వ భావన, పీడిత వర్గాల యోధుల పోరాట, తెలంగాణ ప్రజల స్ఫూర్తి దాగుందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా నాయకులు గాలయ్య, లింగస్వామి, మహేష్, రాకేష్, శాంతికుమార్, శ్రీకాంత్, సురేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

భువనగిరి టౌన్: మాజీ మంత్రి టి.హరీష్‌రావుకు సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, భువనగిరికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సాధనకు, బీఆర్ఎస్ పటిష్టతకు, రాష్ట్ర అభివృద్ధికి హరీష్‌రావు కృషి చేశారని ప్రశంసించారు.

భువనగిరి రూరల్: భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా భువనగిరి నియోజకవర్గ సెగ్మెంట్‌కు సంబంధించి లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్డీవో, ఏఆర్‌వో పరాంకుశం అమరేందర్ తెలిపారు. భువనగిరి నియోజకవర్గంలోని భువనగిరి, బీబీనగర్, పోచంపల్లి, వలిగొండ మండలాల పరిధిలో 2,20,596 ఓట్లకు గాను 1,82,462 ఓట్లు పోల్ అయ్యాయని తెలిపారు. ఈ ఓట్లను రౌండ్ల వారీగా లెక్కింపు నిర్వహిస్తామన్నారు. లెక్కింపునకు పూర్తి ఏర్పాట్లు చేశామన్నారు. ఆయన వెంట డీఏవో మందడి ఉపేందర్‌రెడ్డి ఉన్నారు.

భువనగిరి టౌన్: సూర్యవంశీ ఆరెకటిక భువనగిరి పట్టణ కమిటీని సోమవారం భువనగిరిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు గౌలికార్ కిషన్‌జీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పట్టణ అధ్యక్షుడిగా హీరేకార్ బాలాజీ, ఉపాధ్యక్షుడిగా సందీప్, ప్రధానకార్యదర్శిగా అంజన్‌కుమార్, కోశాధికారిగా జయరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆలేరు రూరల్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మన గ్రోమోర్, శ్రీలక్ష్మీనర్సింహ, బబ్బూరి విశ్వనాథం తదితర ఎరువుల దుకాణాలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌తో పాటు విత్తన ప్యాకెట్లపై వివరాలను పరిశీలించారు. ప్రతీ రోజు తప్పకుండా దుకాణాల ఎదుట స్టాక్ వివరాలను రాయాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఏఈవోలు రాఖేష్, వేణు, శివకుమార్ తదితరులు ఉన్నారు.

ఆలేరు రూరల్: రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గుర్రాల బాలకృష్ణ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బసవ తారక ఆసుపత్రిలో తనకు తెలిసిన వారికి ఓ పాజిటీవ్ బ్లెడ్ అత్యవసరం ఉండగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే గొప్ప మానవీయత అని అన్నారు.

అడ్డగూడూరు: మండలంలోని డి.రాపాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చిప్పలపల్లి ఈదయ్య (70) అనారోగ్యతంతో మృతి చెందాడు. మృతుడి భౌతికాయానికి సోమవారం ఎమ్మెల్యే మందుల సామేలు పూలమాలవేసి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం రూ.10వేలు సాయంగా అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ చేడే చంద్రయ్య, నాయకులు చిప్పలపల్లి పరుశురాములు, లింగాల సుధకర్‌రెడ్డి, నర్సిరెడ్డి, మధుసుధన్ ఉన్నారు.

అతిథి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సంస్థాన్ నారాయణపురం, జూన్ 3: సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ గురుకుల పాఠశాలలో అతిథి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి.వెంకటేశం సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఆంగ్లంలో బోధించేందుకు అనుభవం కలిగిన ఉపాధ్యాయులు కావాలని పేర్కొన్నారు. ఆంగ్లం, గణితం, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శ్రాస్తం, తెలుగు, హిందీ, నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్‌నర్సు)కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పీజీ, డ్రిగీ, బీఈడీ విద్యార్హతలు కలిగిన వారు ఈనెల 10 వరకు అర్హత అనుభవం పత్రాలను జతచేసి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం మూసివేత

చౌటుప్పల్ టౌన్, జూన్ 3: చౌటుప్పల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మూసివేశారు. 50 రోజుల పాటు నిర్వహించిన ఈ కేంద్రంలో 328 మంది రైతుల నుంచి 28,483 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. పీఏసీఎస్ ఉద్యోగి మలిగే మహేష్ పర్యవేక్షణలో ధాన్యం కొనుగోళ్లను నిర్వహించారు.

పాలిసెట్‌లో 'గౌతమి' పూర్వ విద్యార్థుల ప్రతిభ



మనోహర్, అఖిల

భూదాన్‌పోచంపల్లి, జూన్ 3: టీజీ పాలిసెట్ పరీక్షాఫలితాలు -2024 సోమవారం ప్రభుత్వం విడుదల చేసింది. టీజీ పాలిసెట్‌లో యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లికి చెందిన గౌతమి గ్రామర్ స్కూల్ పూర్వ విద్యార్థి రవ్వ మనోహర్ రాష్ట్ర స్థాయిలో బైపీసీలో 171వ ర్యాంకు, ఎంపీసీలో 216వ ర్యంకు సాధించారు. కాగా అదే పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థిని భారత అఖిల ఎంపీసీలో 1841వ ర్యాంకు సాధించగా, ఎంబైపీసీలో 1953వ ర్యాంకు సాధించి ఉత్తమ ప్రతిభను చాటుకున్నారు. కాగా తమ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు టీజీ పాలిసెట్-2024 పరీక్షలో ఉత్తమ ప్రతిభను చాటినందుకు వారిని పాఠశాల కరస్పాండెంట్ రావుల జంగయ్య అభినందించారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

భువనగిరి రూరల్, జూన్ 3: భువనగిరి మండలం మన్నెవారిపంపు గ్రామంలో అకారణంగా ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన వారిపై కేసు నమోదు చేసినట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బొడ్రాయి పండుగ సందర్భంగా గ్రామంలో సామూహిక బోనాలు నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన మేడబోయిన రాముపై అదే గ్రామానికి చెందిన బోయిని నర్సింహ, అతని కుమారులు రాంబాబు, మురళి, సోదరుడు పాండు తన భర్త రాముపై అకారణంగా దాడికి పాల్పడ్డారని రాము భార్య మేడబోయిన శ్రావణి ఫిర్యాదు చేసింది. దీంతో రాము తీవ్రంగా గాయపడ్డాడని పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'నియమావళిని ఉల్లంఘించిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి'

వలిగొండ, జూన్ 3: ఎన్నికల నిబంధలను ఉల్లంఘించిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని సామాజిక సేవ కార్యకర్త తుమ్మల యుగందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు భువనగిరి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగేకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నెల 25వ తేదీన ఎన్నికల కోడ్ ఉల్లంఘించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో, ఒక పోలీస్ అధికారిగా ఉండి రాజకీయ పార్టీకి మద్దతు ప్రకటించిన తెలంగాణ ఉద్యమకారుల పేరుతో పాటల సీడీని ఆవిష్కరించారని ఆరోపించారు. ఈ విషయమై వివిధ పార్టీల నాయకులు విమర్శిస్తున్నారన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లఘించిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని భువనగిరి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి, ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

మానసిక వికాసానికి ఆట, పాటలు దోహదం

చౌటుప్పల్ టౌన్, జూన్ 3: వేసవిలో మానసిక వికాసానికి ఆట, పాటలు దోహదం చేస్తాయని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని చందనస్కూల్‌లో నెల రోజుల పాటు విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌లో కరాటే, డ్యాన్స్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్‌పై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సోమవారం ప్రశంసా పత్రాలను చైర్మన్ రాజు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తాడూరి పరమేష్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.రామేశ్వరి, పాఠశాల డైరెక్టర్ ఎ.గోవర్ధన్, డాన్స్ మాస్టర్ అశ్విని, ఉపాధ్యాయ బృందం స్వప్న, నర్మద, రేణుక, పద్మ, అర్చన పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



రామన్నపేట: రోడ్డుపై వర్షపునీటి గుంతల వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రామన్నపేట, జూన్ 3: రామన్నపేట పట్టణంలో గుంతలతో అధ్వానంగా ఉన్న రోడ్డుకు వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు ఈమేరకు సోమవారం సీపీఎం కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కందుల హనుమంతు మాట్లాడుతూ ఈ రోడ్డు నుంచి దుబ్బాక, మునిపంపుల, అమ్మనబోలు, శోభనాద్రిపురం గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. ఈ రోడ్డు అంతా గుంతలతో నిండి ఉండడంతో రాకపోకలకు ఆటంకాలు కలుగుతున్నాయని, వర్షం వచ్చిన సమయంలో నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గతంలో పలుమార్లు ఆర్అండ్‌బి శాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదని వారు తెలిపారు. చొరవ తీసుకొని వెంటనే రోడ్డును మరమ్మతులు చేపట్టాలని కోరారు. పార్టీ నాయకులు గొరిగే సోములు, పిట్టల శ్రీను, గొల్ల వెంకన్న, ఆముద ఆంజనేయులు, తరికుప్పల వెంకట్‌రెడ్డి, గంజి అశోక్, వేముల మల్లేష్ ప్రసాద్ పాల్గొన్నారు.



పోచంపల్లిలో రోడ్డుపై నీటితో నిండిన గుంతను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

భూదాన్‌పోచంపల్లి : మండల పరిధిలోని పలు గ్రామాల్లో రోడ్లన్నీ గుంతలమయమై చెరువులను తలపిస్తున్నాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రేవణపల్లి, గౌసుకొండ, పెద్దరావులపల్లి గ్రామాల రోడ్లను సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, గుంతలు ఏర్పడ్డాయని, స్వల్ప వర్షానికే చెరువులను తలపిస్తున్నాయని అన్నారు. ఈ రోడ్డుపై ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. పోచంపల్లి నుంచి అనేకమంది ఈ రహదారిపైనే భువనగిరి వెళుతుంటారని, రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రయాణి కులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ రహదారిపై వెళ్లే వాహనదారులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని అన్నారు. వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కుతాటి అశోక్, బాల్‌రెడ్డి, దుబ్బాక దుర్గాప్రసాద్, శివ, లింగస్వామి పాల్గొన్నారు.